గణిత చంద్రిక

GANITHA CHANDRIKA

e-mail : ganithachandrika@gmail.com

సంపుటి : 17 సంచిక : 1&2 (జనవరి-జూన్) సంవత్సరం : 2016

విషయ సూచిక

పాఠకులకు విజ్ఞప్తి

రూ.500/- (వ్యక్తిగతంగా) రూ.600/- (సంస్థపరంగా) పంపిన వారు జీవిత సభ్యులు అవుతారు. మీతోటి పాఠకులను సభ్యులుగా చేర్చండి. **A.I.M.Ed,** జీవిత సభ్యులు త్రైమాసిక పత్రిక గణిత చంద్రికను ఉచితంగా పొందగలరు. తమ రచనలు, సందేహాలను పత్రికా సంపాదకులకు పంపండి. సభ్యత్వ చందాను చెక్, డ్రాఫ్ట్, మనియార్డరు రూపంలో **"Treasurer.A.I.M.Ed."** పేరుతో దిగువ చిరునామాకు పంపగలరు.

"Treasurer"

అసోసియేషన్ ఫర్ ఇంప్రూమెంట్ ఆఫ్ మాథ్స్ ఎడ్యుకేషన్

డోర్ నెం. 22/1-16, మూర్తి వీధి, విజయటాకీస్ వెనుక రోడ్డు,

విజయవాడ - 520002. ఫోన్ : 9246416781

గణిత బోధనలో భాషపాత్ర

– పి.వి. కృష్ణయ్య (ఆంధ్రవిశ్వకళాపరిషత్ గణితశాస్త్రశాఖలో విశ్రాంతాచార్యులు)

ప్రతి బిడ్డకు తొలిగురువు తల్లే. తల్లి అనిపించిన మాటలు అంటూ తల్లి వినిపించిన పాటలు ఆలపిస్తూ, తల్లి చెప్పిన కథలు వింటూ క్రమేపీ ప్రపంచాన్ని తెలుసుకొంటుంది బిడ్డ. అది అలా ఉండగా విద్యాభ్యాసం అనేది మాతృభాషలో అక్షరాలు దిద్దుకోవడంతో ప్రారంభం అవుతుంది. సాధారణంగా దాని ద్వారా లిపిని గుర్తించడం, మాటలు రాయడం క్రమంగా అలవడతాయి. అక్షరాలు నేర్చుకోడం ప్రారంభించిన కొద్దికాలానికే అంకెలు నేర్చుకోడం ప్రారంభమవుతుంది.

ఈవిధంగా “చదువుకోవడం”లో తొలిమెట్టు (మాతృ) భాషదైతే రెండో మెట్టు లెక్కలది. అంటే లెక్కపెట్టడం, కూడికలూ, తీసివేతలూ, గుణకార, భాగహారాలూ జీవితంలో వీటి వినియోగము అన్నమాట. అంటే భాషని వెన్నంటే గణితం కూడా ఉంటుంది. ఒక రకంగా వీటికి సంబంధం ఆది నుంచే ఏర్పడుతుందన్న మాట. భాషాజ్ఞానం బాగా ఉన్న ఆసామికి లెక్కలు సరిగ్గారావనీ, లెక్కల్లో మునిగిన వాడికి భాష సరిగ్గారాదని అలా రాకూడదని చాలామంది అనుకుంటారు. అది అపోహ మాత్రమే.

ఏ శాస్త్రం నేర్చుకోవాలన్నా, ఏ శాస్త్ర విషయాలు సరిగ్గా అవగాహన చేసుకోవాలనుకున్నా ప్రతి విషయాన్నీ సరియైన భాషలో ప్రకటించడం ద్వారానే స్పష్టత చేకూరుతుంది. నేర్పడానికీ, నేర్చుకోడానికీ ఏకైక సాధనం సంభాషణ మాత్రమే. అందువల్ల ఏ విషయాన్ని బోధించాలన్నా సరియైన, స్పష్టమైన, అపార్థాలకు తావియ్యని భాషలో దాన్ని వివరించడం అత్యంత ముఖ్యం. దురదృష్టవశాత్తూ మనదేశంలో బడి పిల్లలలో చాలామందికి లెక్కలంటే భయం ఏర్పడుతున్నది. దీనికి కారణాలు అనేకం. తల్లిదండ్రులలో ఎవరికైనా లెక్కలంటే భయం ఉంటే దాన్ని పిల్లలకి సంక్రమింపచెయ్యడం కావచ్చు. కూడికలూ తీసివేతల తరువాత గుణకారం మొదలుపెడుతూనే పిల్లలచేత ఎక్కాలు బట్టీపట్టించడం మరో కారణం కావచ్చు. ఎక్కాలు బట్టీపట్టడం వల్ల గుణకారంలో వేగం పెరగవచ్చునేమో గాని గుణకారానికి ఎక్కాలు ఆవశ్యకం కావని నా అభిప్రాయం.

గణితం – సాహిత్యం జాతీయ సదస్సులో సమర్పించిన పత్రం

గణిత బోధనలో భాషపాత్ర

- పి.వి. కృష్ణయ్య (ఆంధ్రవిశ్వకళాపరిషత్ గణితశాస్త్రశాఖలో విశ్రాంతాచార్యులు)

ఈ పట్టిక చూడండి.

1	2	3	4	5	6	7	8	9
2	4	6	8	10	12	14	16	18
3	6	9	12	15	18	21	24	27
4	8	12	16	20	24	28	32	36
5	10	15	20	25	30	35	40	45
6	12	18	24	30	36	42	48	54
7	14	21	28	35	42	49	56	63
8	16	24	32	40	48	56	64	72
9	18	27	36	45	54	63	72	81

మొదటి అడ్డు వరసలో ఉన్న ఒక అంకెని మొదటి నిలువు వరుసలో ఉన్న ఒక అంకెతో గుణించాలంటే మొదటి అంకె ఉన్న కాలమ్ లో రెండో అంకె ఉన్న రో లో ఉన్నదాన్ని గుర్తిస్తే చాలు. అసలు ఈ పట్టికని ప్రతి విద్యార్థి తనకు తానే తయారుచేకుకోవచ్చు. ఒక రో ని నింపాలంటే వరసగా దాని మొదటి అంకె కలుపుతూ గళ్లు నింపడమే, లేదా కాలమ్‌ల వారీగా కూడా నింపవచ్చు. ఈ విధంగా పై పట్టికని స్వయంగా తయారు చేసుకోవడం నేర్పితే ఎక్కాలు బట్టిపట్టకుండా గుణకారాలు చేసే నేర్పు క్రమంగా అలవాటవుతుంది. కొన్ని లెక్కలు అభ్యాసం చేశాక వేగం కూడా పెరుగుతుంది. అంతేకాని మొదట్లోనే 20x20వరకూ ఎక్కాలన్నీ కంఠస్థం చేయించడం అనవసరం. పదిహేడు

పదమూళ్లు ఎంత అంటే ఠకీమని సమాధానం చెప్పలేనివాడు పనికిరాని వాడు అనడం అనుచితం. గణితం ఈ చిన్న లెక్కలకు అతీతమైన తర్కజనిత శాస్త్రం.

ఇక్కడ భాష పాత్ర ఏమిటి? అనే ప్రశ్న సహజం. ఉదాహరణకి మూడో అడ్డువరుసని ఎలా నింపుతామో చూడండి. మొదటి కాలమ్‌లో మూడుంది. దానికి మూడు కలిపి రెండో కాలమ్‌లో ఆరువేస్తారు. దానికి మూడు కలిపి తరువాత కాలమ్‌లో వేస్తాం. ఆ వచ్చిందానికి మూడు కలిపి ఆ తరువాతి కాలమ్ ఈవిధంగా మూడో రో నింపుతాం. అలాగే రెండో రో నుంచి తొమ్మిదో రో వరకూ. పదో రో ఎలా వస్తుంది? మొదటి రో లో అంకెలకి కుడి పక్క సున్న తగిలించి వేసెయ్యడమే అని చాలా వరకూ పిల్లలే తమంతట తామే తెలుసుకుంటారు. ఇక్కడ నేను చెప్పింది గమనించండి. ప్రతి రో ని నింపడంలోనూ గుణకారాన్ని కూడికల సమాహారంగా ప్రదర్శించడం అనేది ముఖ్యపాత్ర ధరిస్తుంది. అదే గుణకారం నేర్పడంలో భాష పాత్ర.

సంఖ్యలు ఎలా ఏర్పడ్డాయి? ఒక వస్తు సముదాయంలోని వస్తువుల్ని లెక్కపెట్టడానికి సంఖ్యలు ఏర్పడ్డాయి. మానవులు వ్రాయడం నేర్చుకోడానికి ముందే లెక్కపెట్టడం నేర్చుకున్నారని వింటుంటాము. గొర్రెల్నో, మేకల్నో మేతకు తీసికెళ్ళినప్పుడు ఒక్కొక్క జంతువుకి ఒకొక్క గులకరాయి చొప్పున ఒక మూటగా కట్టి తిరిగి వచ్చాక లెక్క సరిచూసుకునే వారట.

తరువాత కొంతకాలానికి చేతివేళ్లనుపయోగించి ఒకటి, రెండు, మూడు వగైరా వేళ్లను సంఖ్యావాచకాలుగా సృష్టించుకున్నారు. రెండు చేతుల వేళ్లతో పది వరకూ లెక్కపెట్టవచ్చు. కొంతకాలానికి ఇద్దరు కలిసి వంద వరకు సంఖ్యల్ని లెక్కపెట్టే పద్ధతి కనిపెట్టి ఉండవచ్చు. పదికంటే ఎక్కువ వస్తువులుంటే పదికాగానే రెండో వ్యక్తి ఒక వేలు చాపి, మరో పది లెక్కించాక మరో వేలు చాపి ఈ విధంగా ఇద్దరు కలిసి వందవరకూ లెక్కించడం, ముగురుంటే వెయ్యి వరకు లెక్కించడం సాధ్యపడి ఉంటుంది. ఆ తరువాత అంకెలను పదుల స్థానంలోనూ వందల స్థానంలోనూ, వేల స్థానంలోనూ ఉంచడం ద్వారా చాలా పెద్ద సంఖ్యలను వ్రాత పూర్వకంగా ప్రదర్శించే పద్ధతి ఏర్పడడానికి చాలా

శతాబ్దాలు పట్టి ఉంటుంది. ఈ పద్ధతిని, దీనిలో ముఖ్యపాత్ర ధరించే సున్నా అనే అంకెను మన భారతీయులే కనిపెట్టారని అంటారు.

కూడికలు : కూడిక అంటే ఏమిటి? అనేది చెప్పకుండా కూడికలు చేయిస్తున్నారు కొందరు. రెండు సంఖ్యల మొత్తం అంటే ఏమిటి? 39, 57ల మొత్తం అంటే ఏమిటి. ఒక సముదాయంలో 39 వస్తువులు, మరొక సముదాయంలో 57 వస్తువులూ, ఒకదాన్లోది ఏదీ మరో దానిలో లేకుండా ఉంటే ఆ మొత్తం సుముదాయంలో ఎన్ని వస్తువులుంటాయి? ఈ మొత్తం సంఖ్య ఎలా వస్తుంది? 57 చింతగింజల్ని తీసుకుని 39 తరువాత 40 నుంచి ప్రారంభించి లెక్క పెట్టడమే. లేదా 39 గింజల్ని తీసుకొని 57 తరువాత 58 నుంచి లెక్క పెట్టడం. ఇది సూటియైన పద్ధతి ఇలా కొన్ని కూడికలు పిల్లలచేత చేయిస్తే అందులో కష్టము అర్థమైనప్పుడు అంకెలను ఒకదానికింద మరొక దానిని రాసి స్థానాలవారీగా కలపడం అనే ప్రక్రియను నేర్పాలి. అప్పుడు విద్యార్థికి ఈ ప్రక్రియలోని సులువు అర్థమవుతుంది.

సంఖ్య కింద సంఖ్య రాసి చేస్తున్న ప్రక్రియ 'కూడిక' చేసే సులభ పద్ధతేకాని అదే 'కూడిక' కాదు అని విద్యార్థికి అవగాహన కావాలి. అక్కడే భాష ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది.

అలాగే తీసివేత. తీసివేత అంటే అర్థం ఏమిటి? 428 నుండి 276 తీసెయ్యడం అంటే ఏమిటి? ఏ సంఖ్యకి 276 కలిపితే 428 వస్తుందో దాన్ని కనిపెట్టడం. ఆ కనిపెట్టడానికి సులువు పద్ధతి నీకు నేర్పుతున్నాం. ఆన్సరు వచ్చాక దానికి 276 కలిపి సరిచూసుకో అని చెప్పచ్చు. ఆ విధమైన అవగాహన పిల్లలలో కలిగిస్తే లెక్కలు చెయ్యడంలో 'కష్టం' తగ్గిపోతుంది. జీవితంలో అవసరాలకు కావలసిన కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ, భాగహారాలూ చేసే సులభ పద్ధతులే టీచరు తనకు నేర్పుతున్నారని విద్యార్థికి తెలియాలి. దీనికి సంభాషణ కావాలి. అంటే భాష కావాలి. తీసివేత ప్రక్రియలోని ప్రతి అంశంలోనూ భాష పాత్ర చాలా ఉంటుంది. దీన్ని తెలుగులో పాఠం చెప్పే మాస్టర్లు బాగా వాడేవారు. తెలుగు పిల్లలకి ఆంగ్ల మాధ్యమంలో

బోధించడంలో ఈ సులువు, ఈ అవగాహనా వస్తాయా అని నా సందేహం.

కూడికలూ. తీసివేతలూ గుణకార భాగహారాలూ మాత్రమే గణితం కాదు. ఇవి గణితానికి మొదటి సోపానాలు మాత్రమే. కంప్యూటరు కన్నా వేగంగా క్లిష్టమైన గుణకారాలు వగైరాలు చేసే బాలమేధావుల్ని నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక చిన్న చిన్న సమస్యలలో ముఖ్యంగా డబ్బులావాదేవీలలో కొనుగోళ్లు అమ్మకాలలో తదితర విషయాలలో ఈ ప్రక్రియల ప్రయోజనం విశదీకరించడం ద్వారా లెక్కలలో పిల్లలకి ఆసక్తి కలిగించాలి. గణనయంత్రాలు (Caluculators) ఉన్న ఈ రోజుల్లో ఈ లెక్కలను వేగంగా చేయవలసిన అవసరం కూడా బాగా తగ్గిపోయింది.

సహజ సంఖ్యలు అనే పేరుగల ధనపూర్ణాంకాల పరిజ్ఞానం అనంతరం పిల్లలకి ఋణసంఖ్యలు, భిన్నాలు నేర్పుతాం. ఋణసంఖ్యలని, భిన్నాలని మనమే సృష్టించుకున్నామనీ దానివల్ల ఎన్నో సమస్యలు దూదిపింజలులాగా విడిపోయాయని వాళ్లకి తెలిసేలా చెబితే వాళ్లే వాటిని నేర్చుకోడానికి ఆసక్తి చూపుతారు. ఇక్కడ మైనస్ ఇంటూ మైనస్ ప్లస్ అవుతుందన్నది కొంత ఇబ్బంది పెడుతుంది.

దీనికిగాను ముందుగా – × అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. దేనిని × కు కలిపితే సున్న వస్తుందో దానిపేరే – ×. దీనినే × యొక్క సంకలన విలోమం అంటాం.

– x X y ని x X y కు కలిపితే

(- x X y) + (x X y) = (- x + x) X y = 0 X y = 0

కనుక - x X y అనేది x X y కి సంకలన విలోమం. ఇప్పుడు పై విధంగానే

- x X - y ని - x X y కు కలిపితే

x X (- y + y) = - x X 0 = 0 కాబట్టి - x X -y = - (-x X y)

కనక - x X - y, x X y లు ఒకే సంఖ్య.

బహుశా : ఈ తర్కాన్ని 'ఆల్జీబ్రా' కొంచెం నేర్చుకున్నాక బోధిస్తే సులభం కావచ్చు. నా అభిప్రాయం ఏమిటంటే కేవలం స్టెప్ తరువాత స్టెప్ లాగా కనిపించే ఆల్‌జీబ్రాలో స్టెప్‌ల వెనక తర్కం, భాష ఎంతగానో దాగి ఉన్నాయని ఏదో ఒక దశలో

విద్యార్థికి తెలియజేయాలి. ముఖ్యంగా అతడు / ఆమె ప్రశ్నించినప్పుడు విద్యార్థిపై తరగతులకి వెళ్లినపుడు అంకెలని సంకేతాలతో సూచించడం ద్వారా కొన్ని సూత్రాల నేర్పరచుకునే పరిస్థితి వస్తుంది. దీన్నే 'ఆల్జీబ్రా' అనేవారు.

ఆల్జీబ్రా అంటే గాబ్రా అని విద్యార్థుల్లో మారోజుల నుంచీ ఒక అపోహ ఉండేది. ఈ బీజగణిత సూత్రాలవల్ల వచ్చే సౌలభ్యాన్ని టీచర్లు విద్యార్థులకి నచ్చ చెప్పాలి. ఒక చిన్న ఉదాహరణ చెప్తాను.

$a(b+c) = ab + ac$ అనే సూత్రం తీసుకోండి. ఇందులోని విషయాన్ని గుర్తులు వాడకుండా వివరించడానికి ప్రయత్నించమని విద్యార్థులకి చెప్పండి. మీరు చేసి చూపించండి. మూడంకెలున్నాయనుకుందాం, అందులోది మొదటి అంకెను మిగతా రెండంకెల మొత్తంలో గుణించినా, ఆ మొదటి అంకెని రెండో అంకెతోనూ, మూడో అంకెతోనూ విడివిడిగా గుణించి ఆ లబ్ధాలని కలిపినా, ఒకటే ఆన్సరు వస్తుంది. ఇంత వివరణని ఆ తెలియని అంకెలకి a ,b, c అని పేర్లు పెట్టి ఒక సూత్రం ద్వారా ఎంత హాయిగా చెప్పవచ్చో నచ్చచెబితే విద్యార్థికి గాబ్రా ఎందుకొస్తుంది?

నేను ఇక్కడ సూత్రాల ఉపపత్తుల్ని గురించి మాట్లాడడం లేదు. ఏ సూత్రం ఏంచెబుతుంది? అనే దాన్ని సూత్రం సాయంలేకుండా చెప్పడానికి ప్రయత్నిస్తే వచ్చే కష్టాన్ని గుర్తిస్తే చాలు. విద్యార్థులకి సూత్రాల ప్రయోజనం అర్థమై వాటిని నేర్చుకోడం, వాడడం మీద ఆసక్తి పెరుగుతుంది. సాంకేతిక భాష నేర్చుకొనేందుకు, అలవాటు చేసుకునేందుకు ఉత్సాహపడతారు. ఒక ముఖ్యమైన విషయం. పిల్లలు ప్రశ్నలు వేసినప్పుడు వాళ్లని కోప్పడకూడదు. ప్రశ్నించేతత్వం ద్వారానే ఏ శాస్త్రం అయినా ఆలోచనకి, తద్వారా అవగాహనకీ, పైమెట్టుగా సృజనకి దారి తీస్తుంది. ప్రశ్నించడం, తర్కించడం ప్రతిశాస్త్రానికీ, ప్రతివిద్యార్థికీ, ప్రతీ టీచరుకి నిత్యావసరం. గణితశాస్త్రానికి మరింత అవసరం. ప్రతీ శాస్త్రానికి కొన్ని ప్రాథమిక విశ్వాసాలు (గణితశాస్త్ర విభాగాలలో వీటిని స్వీకృతాలు అంటాము) పునాదిగా అంగీకరించి వాటినుంచి తార్కికంగా శాస్త్ర సిద్ధాంతాలను రాబట్టి, ఆ వచ్చిన ఫలితాలు అనుభవం ద్వారా లేదా ప్రయోగం ద్వారా సరిచూసుకుంటాం

(verification) ఉదాహరణకు ప్రపంచంలో వస్తువుల కదలిక (Motion)కి సంబంధించిన భౌతికశాస్త్ర విభాగానికి (Dynamics) న్యూటన్ గారి మూడు సూత్రాలూ, గురుత్వాకర్షణ సూత్రము పునాది.

అట్లాగే జ్యామితి (Geometry) అనే గణితశాస్త్ర విభాగానికి బిందువు, సరళరేఖ, సమతలం వీటికి సబంధించిన యూక్లిడ్ స్వీకృతవ్యవస్థని పునాదిగా భావిస్తాం. యూక్లిడ్ సమాంతర స్వీకృతం (Parellel postulate) గురించి మీరంతా వినే ఉంటారు. దీనిని అంగీకరించకుండా దీని బదులు వేరే స్వీకృతాన్ని పెట్టుకుని కొన్నింటిని సృష్టించారు కూడా. ముఖ్యమైన సంగతి ఏమిటంటే ఏ శాస్త్ర విభాగానికైనా తీసుకున్న స్వీకృతాల (axioms లేదా theory) నుంచి తార్కికంగా పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు ఉద్భవించకూడదు. ప్రయోగాత్మక శాస్త్రాలలో ఒక థియరీ నుంచి అనుభవానికి విరుద్ధమైన ఫలితం రాకూడదు. ఈ రకమైన చర్చ అంతకీ నిర్దుష్టమైన భాషా జ్ఞానం అత్యంత ఆవశ్యకం.

మా గురువుగారు ఆచార్య వొమ్మి రామస్వామిగారు వారానికి ఒక పిరియడ్ కేటాయించి ఎం.ఏ. విద్యార్థులకు ఆంగ్లంలో భావాన్ని స్పష్టంగా తెలియజేయడం నేర్పేవారు. చర్చ అంతా తెలుగులోనే జరిగేది. ముందుగా చెప్పదలచినదాన్ని సూటిగా తెలుగులో చెప్పించి తరువాత ఇంగ్లీషులో చెప్పడం అలవాటు చేసేవారు. ఆంగ్ల వ్యాకరణం కూడా కొంత అభ్యాసం చేయించేవారు. Clause analysis, changing degrees of comparison, opposite sentence construction వంటివి విద్యార్థుల చేత చేయించేవారు. నిజానికి మా డిపార్టుమెంటులో మేమంతా సిద్ధాంతాలు, ఉపపత్తులు ఇంగ్లీషులో (అవసరం కాబట్టి) చెప్పినా, చర్చ అంతా తెలుగులో జరిపేవాళ్లం. విద్యార్థులు సందేహాలని తెలుగులో అడగడం వాటిని మేం తెలుగులో నివృత్తి చేయడం జరిగేది. విద్యార్థులచేత ఉపపత్తులు చెప్పించి మేం ఎదురు ప్రశ్నలు వేసేవాళ్లం.

హైస్కూలు గణితంలో స్థిరరాశులు, చలరాశులు అంటే constants, variables అనే పదాలు తటస్థపడుతుంటాయి. నా అభిప్రాయంలో రాశులు అనేది వ్యర్థపదం.

గణిత బోధనలో భాషపాత్ర

– పి.వి. కృష్ణయ్య (ఆంధ్రవిశ్వకళాపరిషత్ గణితశాస్త్రశాఖలో విశ్రాంతాచార్యులు)

గణితంలో మొదట సంఖ్యలు, తరువాత సమితులూ, మూలకాలు (sets, elements) వగైరాలు మాత్రమే ప్రధానపాత్రలు.

ఇంగ్లీషులో quantities తెలుగులో రాశులూ అనేవి అనవసరపదాలు.

మనం వాడే గుర్తులు మాత్రమే Variable symblols, Constant symbols అని వింగడించుకోవచ్చు. Constant symbols అంటే నామవాచకాలు (ప్రస్తుతానికి సంఖ్యలలోనే) Variable symbols అంటే సర్వనామాలూ అని అర్థం చేసుకుంటే చాలా సమస్యలు తొలగిపోతాయి. అనేది ఒక ప్రత్యేక సంఖ్యని, ఈ సందర్భంలో ఆద్యంతమూ సూచిస్తుంది. పెద్ద సంఖ్యనైనా ఒక చిన్నగుర్తుతో సూచిస్తామన్నమాట. Variable symbols అనేది (ఒకసమితికి చెందిన) ఏ సంఖ్య అయినా కావచ్చు. అంటే సర్వనామంలాంటి దన్నమాట గణిత బోధనలో వ్యాకరణం వచ్చిందిక్కడ. ఈ Variables అంటే Variable symbols ఒక వాక్యం (Statement or Assertion)లో వాటికి సంబంధించిన ఏ వివరణా లేకుండా తటస్థపడితే అలాంటి వాక్యానికి అర్థం ఏర్పడదు. అటువంటి వాటిని వివృతవాక్యాలు అంటాము. ఆ సింబల్ స్థానంలో తెలిసిన సంఖ్యలని (మూలకాలని) ప్రతిక్షేపించినప్పుడే వాక్యానికి అర్థం ఏర్పడుతుంది. ఈ చర్చ ఇంతటితో ఆపుదాం. Constant అనే మాట ప్రమేయవాదంలో కూడా తటస్థపడుతుంది. పమ్రేయానికి శాస్త్రీయ నిర్వచనం (ప్రత్యేక లక్షణాలున్న సంబంధం అని) మొదట్లో చెబితే అర్థంకాకపోవచ్చు కాబట్టి ఈ విధంగా చెప్పవచ్చు.

ప్రమేయాన్ని ఒక 'మాయాదర్పణం'గా ఊహించవచ్చు. ప్రతీ ప్రమేయమూ ఒక మాయా దర్పణమే. ఒక ప్రమేయాన్ని f అనే సంకేతంతో సూచిద్దాము. f ముందు x అనే సంఖ్యను నిలబెడితే (x అనేది f యొక్క ప్రదేశం అనగా Domainలో ఉండాలి) f అనే మాయాదర్పణంలో కనబడే ప్రతిబింబాన్నే f (x) అంటాం. దీనినే f లో x ప్రతిబింబం అని పిలుస్తాం. మామూలు అద్దాల లాగా వస్తువు, ప్రతిబింబము ఒకటే కానక్కరలేదని గమనించాలి. ఇప్పుడు ఒక మాయాదర్పణం (ప్రమేయం) ముందు ఏ సంఖ్యను నిలబెట్టినా ప్రతిబింబం మారకుండా ఒకే సంఖ్య అయిందనుకోండి. అంటే x ఏదైనా f (x) మాత్రం

ఒకే సంఖ్య K వస్తోంది అనుకోండి. అటువంటి ప్రమేయాన్ని స్థిరప్రమేయం Constant function అంటాము.

సమీకరణం (equation) అంటే ఏమిటి? సమీకరణానికి, సూత్రానికి తేడా ఏమిటి? సూత్రం ఒక విషయాన్ని చెబుతుంది. సమీకరణం తనని సాధించమంటుంది. అంటే సాల్వ్ చెయ్యమంటుంది. దీని భావం ఏమిటంటే సమీకరణాన్ని రాసినప్పుడు అక్కడ ప్రశ్నార్థక గుర్తు లేకపోయినా అది ఒక ప్రశ్న అని.

$6 \times + 7 = 8 \times + 3$

అనే సమీకరణం రాస్తే దాని అర్థం "× బదులు ఏ సంఖ్యని రాస్తే పైనున్న రెండు వైపుల సంఖ్యలూ సమానం అవుతాయి?" అని అడగడం అన్నమాట. దీన్ని సాల్వ్ చేయాలంటే ఏంచెయ్యాలి? అల్లాంటి సంఖ్య ఉందనుకుని దాని పేరు K అనుకుంటే

$6K + 7 = 8K + 3$

అవుతుంది. రెండు వైపులా 6 K ని తీసేస్తే

$7 = 2K + 3$

కావాలి. ఇప్పుడు రెండు వైపులా 3 తీసేస్తే

$4 = 2K$

కావాలి. దీని నుంచి $K = 2$ కావాలి అని సమాధానం వస్తుంది. ఇప్పుడు మొదటి సమీకరణంలో × బదులు 2 రాస్తే రెండువైపులూ సమానం అవుతాయని గమనించవచ్చు. దీనిని బట్టి $\times = 2$ అనేది ఒకటే ఈ సమీకరణానికి సాధన అని తెలుతుంది. నిజానికి ఈ తర్కమంతా సమీకరణ సాధనలో ప్రతి స్టెప్‌లోనూ మన మెదడులో నడవాలి. కొన్నాళ్లు ఆ విధంగా చెప్పిస్తే తరువాత సమీకరణాల సాధనలో పిల్లలకి గందరగోళం పోతుంది.

ఉన్నత తరగతుల్లో మొదటి తరగతి, రెండో తరగతి సమీకరణాలని సూత్రపద్ధతిలో సాధించడం తెలుసుకుంటారు.

 ISSN : 0973-3493

$ax + b = cx + d, a \neq c$

అని సమీకరణం ఇస్తే దానికి $x = \frac{d-b}{a-c}$

ఒకటే సాధన అని నేర్చుకుంటారు.

అలాగే $ax^2 + bx + c = 0$ అనే వర్గ సమీకరణానికి($a \neq 0$ కావాలి)

$$\frac{-b+\sqrt{b^2-4ac}}{2a}, \quad \frac{-b-\sqrt{b^2-4ac}}{2a}$$

అనే రెండు సాధనలు మాత్రమే ఉంటాయని తెలుసుకుంటారు. సమీకరణాలన్నీ ఇలాగే ఉండక్కరలేదు.

ఉదాహరణకి

$$x + \sqrt{x^2 + 1} = 0$$

అనే సమీకరణం తీసుకుందాం. దీనికి ఒక సాధన ఉన్నదనుకొని దానికి K అనే పేరు పెడితే

$$k + \sqrt{k^2 + 1} = 0$$

కావాలి అంటే

$$\sqrt{k^2 + 1} = -K$$

కావాలి. రెండు వైపులా వర్గం చేస్తే

$$k^2 + 1 = k^2$$

కావాలి, అంటే 1=0 కావాలి. ఇది అసంభవం కాబట్టి పై సమీకరణానికి సాధన లేదు అని తార్కికంగా ఋజువైంది. ఇదంతా మాతృభాషలో బోధిస్తే అవగాహన అయినట్లు ఇతర భాషలలో బోధిస్తే అవగాహన కాకపోవచ్చు. బీజగణితం(Algebra) జ్యామెట్రీ (Geometry) కలనగణితం, టాపాలజీ ఇత్యాది అనేక గణితశాస్త్ర విభాగాలలో మాటలు లేకుండా స్టెప్స్‌లాగా కనిపించేవి ఎన్నో ఉంటాయి. ఆలోచించే వాళ్లకు ఆ స్టెప్స్‌లో ప్రతిదాని వెనకాల ఒక సంపూర్ణ వాక్యం, పైనున్న స్టెప్ నుంచి తరువాతి స్టెప్ తార్కికంగా ఎలా వస్తుంది? అన్న సంగతి మనసులో మెదులుతూనే ఉంటుంది.

అలా మెదులుతూ ఉండడమే అవగాహన. అది లేకుండా స్టెప్స్ బట్టీపట్టే వాళ్లు ఎప్పటికీ తమంతటతాము ఏ సిద్ధాంతానికి ఉపపత్తి చెప్పలేరు. తమంతట తాము దేనినీ కనుక్కోలేరు. ప్రపంచంలో అది వరకు తెలిసినదైనా సరే మనంతట మనం ఒక సూత్రాన్ని కనుక్కోగలగడంలో గొప్ప ఆనందం ఉంది. ఇదంతా కూడా ఆలోచన ద్వారా లభిస్తుంది. శ్రీనివాస రామానుజన్ హైస్కూలులో చదువుకునే రోజుల్లో అతనికి ఎవరో ఒక పుస్తకం ఇచ్చారట. దానిలో 6వేల సూత్రాలున్నాయట. అవన్నీ గణితంలో అదివరకు ఋజువైన సిద్ధాంతాలే ఉపపత్తులు ఆ పుస్తకంలో లేవు. అందులో కాలేజీ విద్యార్థులకు కూడా తెలియని సూత్రాలు చాలా ఉన్నాయట. రామానుజన్ తీరిక సమయాల్లో వాటన్నిటినీ స్వయంగా ఋజువు చేశాడట. ఆ అనుభవంతో తరువాత తానే కొత్త సిద్ధాంతాలు కనిపెట్టాడట. ఆలోచనకి ఆధారం భాష. ఆ విధంగా ఒక శాస్త్రాన్ని నేర్పాలన్నా, నేర్చుకోవాలన్నా భాష ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఆ భాషలో స్పష్టత ద్వారా మన ఆలోచనలోనూ మన తర్కంలోనూ స్పష్టత, నిర్దుష్టత ఏర్పడుతుంది. ఆధ్యాత్మిక ప్రవాచకులు కొందరు (అందరూ కాదు) తాము చెప్పే దైవ మహిమలను ఎంత మాత్రం తర్కించకుండా విశ్వసించాలని అంటూ ఉంటారు. శిష్యుడెప్పుడూ గురువుతో వాదించకూడదని అలా చేస్తే పారమార్థిక విద్య అలవడదని అంటారు. ఒక మహాత్ముని సూక్తి వినిపిస్తారు.

తెలివి తర్కమింగితము నే దేవుడు మన
కిచ్చెనో అతడే మన మెపుడు వాని
వాడ కూరక పారవైచ వలె ననుచు
కోరునని నేను నమ్మగా నేర నసలు

కొన్ని గణిత సిద్ధాంతాలు గొప్ప జీవిత సూత్రాలను ఆవిష్కరిస్తాయి. వాస్తవ సంఖ్యలను గూర్చిన ఆర్కిమెడీస్ సిద్ధాంతాన్ని గమనించండి.

B ఒక ధన సంఖ్య అనుకోండి. ఏ సంఖ్య A ఇచ్చినా

$$N \times B > A$$

అయ్యేటట్లు ఒక సహజ సంఖ్య N ఉంటుంది. సంఖ్య A మనకీ, మన లక్ష్యానికీ మధ్య దూరం అనుకుందాం. సంఖ్య B . మన 'అంగ' తాలూకు కొలత అనుకుందాం. పై సిద్ధాంతం ఏం చెబుతుంది? 'అంగ' ఎంత చిన్నదైనా, లక్ష్యం ఎంతదూరంలో ఉన్నా తగినన్ని అంగలు వేస్తే లక్ష్యాన్ని తప్పక అధిగమించవచ్చు అనే నీతిని బోధిస్తుంది.

చూడడానికి, వినటానికి రెండూ విభిన్నంగా, ఒకదానితో పొసగని పదార్థాలుగా కనిపించే ఆంశాలు గణితం, కవిత్వం. ఈ రెండిటికీ సమన్వయం ఏమిటనేది సాధారణంగా చర్చకు రాని అంశం. అర్థం కాని అంశం. ఇంకా మాట్లాడితే గణితానికి, కవిత్వానికి మధ్య సంబంధం గురించి మాట్లాడడం అనేది ఓ పిచ్చివాడి ప్రేలాపన. ఎందుకంటే సాధారణ అర్థంలో సాహిత్యం లేదా కవిత్వం అనేది భాషకు సంబంధించిన అంశం. కొన్ని ఊహలు, వాస్తవ సంఘటనలు, కల్పనలు ప్రాతిపదికగా రచన లేదా కవిత్వం సాగుతుంది. గణితం విషయానికి వస్తే ఏవో కొన్ని అంకెలు, సంఖ్యలు, దత్తాంశాలు, సిద్ధాంతాలు, నిరూపణలు, నిర్మాణాలు కనిపిస్తాయి. ఇదంతా బాహ్య పరిశీలన. ఈ కోణంలో ఈ రెండూ శాస్త్రాలకు లంకె ఏమీ ఉండదనే అనిపిస్తుంది. కానీ, కొద్దిగా అంత: పరిశీలన చేసి చూస్తే ఈ రెండు శాస్త్రాలూ ఒకదానితో మరొకటి సుస్పష్టమైన అంతర్గత సంబంధం కలిగి ఉన్నాయనేది తెలుస్తుంది. ప్రాచీన సాహిత్యం నుంచి నేటి సాహిత్యం వరకు అనేక ప్రక్రియల్లో ఈ విషయం స్పష్టమవుతుంది. ముందుగా ప్రాచీన సాహిత్యంలోని కొన్ని అంశాలు తీసుకుందాం. మనందరికీ తెలిసిన అతి ప్రాచీన హైందవ యంత్రం శ్రీ చక్రం. తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం నుంచి సాధారణ వ్యాపార దుకాణాల వరకు ఈ యంత్రాన్ని పూజలో ఉంచుతారు. వేదాంగ జ్యోతిష్యమనే గ్రంథంలో ఈ యంత్రం గురించిన ఒక ధ్యాన శ్లోకం ఉంది. అదేమిటంటే..

బిందు త్రికోణ వసుకోణ దశార యుగ్మం
మన్వస్ర నాగదళ షోడశ సంయుతారం
వృత్త త్రయం చ ధరణీ సదన త్రయం చ
శ్రీచక్రరాజ ముదితం పరదేవతాయా: ॥

గణితం – సాహిత్యం జాతీయ సదస్సులో సమర్పించిన పత్రం

దేవతలు, వారి అపూరూప మానవాతీత శక్తుల విషయాన్ని పక్కన పెట్టి, ఈ శ్లోకాన్ని పరిశీలన చేస్తే శ్రీ చక్ర యంత్రంలోని అద్భుతమైన గణిత విశేషాలు మనకు కనిపిస్తాయి. బిందువు, త్రికోణం, అష్ట కోణాలు, వృత్తాలు.. ఇలా శ్రీ చక్రంలో ఉంటే ఎన్నో గణిత నిర్మాణాలను ఈ శ్లోకం ద్వారా వివరించటం జరిగింది. ఎన్నో వేల సంవత్సరాల నుంచి మనదేశంలో శ్రీ చక్ర యంత్రం పూజలందుకుంటోంది. అంటే అతి ప్రాచీనకాలంలోనే మన దేశంలో గణిత వికాసం జరిగిందనీ, ఆ గణిత విజ్ఞానాన్ని ప్రజలకు అందించటానికి ప్రాచీన భారతీయ విజ్ఞానవేత్తలు సాహిత్యాన్ని ఆధారంగా చేసుకున్నారని స్పష్టమవుతోంది.

భాస్కరాచార్యుడు మనదేశంలోని ప్రాచీన గణిత శాస్త్రవేత్తల్లో ప్రముఖుడు. ఆయన రాసిన లీలావతి గణితం ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. గ్రంథం అంతా (శ్లోకసాహిత్యం ఆధారంగానే) సాగింది. లీలావతి గణితంలోని ఒక ఉదాహరణ తీసుకుందాం.

బాలే! మరాలకుల మూల దలాని సప్త
తీరే విలాస భర మంధర గాణ్య పశ్యమ్
కుర్వచ్చ కేలి కలహం కలహంస యుగ్మం
శేషం జలే వద మరాల కుల ప్రమాణమ్!!

ఈ శ్లోకానికి భావం ఏమిటంటే.. ఓ అందమైన సరస్సులో కొన్ని హంసలు విహరిస్తున్నాయి. అక్కడ ఎన్ని హంసలు ఉన్నాయో వాటి సంఖ్యామూలంలో 7/2 వంతు కేళీవిలాసంతో నెమ్మదిగా సరస్సు ఒడ్డుకు చేరుకున్నాయి. మిగిలిన రెండు హంసలు హాయిగా జలక్రీడలాడుతూ ఉంటే మొత్తం హంసల సంఖ్య ఎంత?

ఇదీ భాస్కరాచార్యుడు మనల్ని లీలావతి పేరుతో అడిగిన ప్రశ్న. సాధారణ గణిత భాషలో చెప్పాలంటే ఈ లెక్కను ఎక్స్ మైనస్ సెవెన్ బై టు ఎక్స్ అనే సమీకరణాన్ని సాధన చేయమని అడగాలి. ఇలా అడగటం కన్నా కవిత్వ ఛాయలో ఓ అందమైన సరస్సు, హంసలు అందులో ఆడుకోవటం.. ఇలా ఓ మధురమైన భావనను పరిచయం చేస్తూ లెక్కలు చేయించారు భాస్కరాచార్యుడు.

అంతేకాదు.. లెక్క ప్రారంభంలోనే బాలే! అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ తన లెక్కను వివరించారు భాస్కరాచార్యులు. దీనివల్ల ఏదో లెక్కలు చేయటం మొదలు పెట్టామనో, ఇప్పుడు మనం లెక్కలు చేయాలనో పాఠకుడికి లేదా సాధకుడికి అనిపించదు. ఏ మాత్రం కష్టమనే భావన లేకుండానే సమస్యను సాధించడానికి అతడు సమాయత్తమవుతాడు. ఈ ఉదాహరణ ద్వారా కూడా నిరూపితమైన సత్యం ఏమిటంటే.. గణిత సమస్యలను సాధారణ గణిత సమీకరణాల కన్నా ఎంతో తేలికగా కవిత్వం ద్వారా వ్యక్తీకరించవచ్చు అని.

మన ప్రాచీన గణిత శాస్త్రవేత్తలో ప్రసిద్ధి పొందిన మరొక వ్యక్తి ఆర్యభట్ట. ఈయన ప్రకటించిన కటపయాది పద్ధతి అత్యంత మనో వైజ్ఞానికమైందిగా పాశ్చాత్యులు సైతం అంగీకరించారు. అక్షరాలకు, అంకెలకు మధ్య ఓ సంబంధాన్ని ఏర్పరచి, అతి పెద్ద సంఖ్యలను సైతం అతి తేలికగా గుర్తుంచుకునే విధానం ఇది. దీని ద్వారా సాధారణంగా అందరూ గణిత పరిభాషలో చెప్పుకునే 'పై' విలువను 22 స్థానాల వరకు అతి తేలికగా గుర్తుపెట్టుకోవచ్చు. అంటే.. ఆర్యభట్ట కూడా సాహిత్యాన్ని లేదా కవిత్వాన్ని తన గణిత ఆవిష్కరణను ప్రకటించటానికి ఉపయోగించుకున్నారనే విషయం రూఢి అవుతోంది. ఇవన్నీ సంస్కృత సాహిత్యానికి సంబంధించిన ఉదాహరణలు. ఇక తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే.. తెలుగులో వచ్చిన మొట్టమొదటి గణిత గ్రంథం పావులూరి మల్లన రాసిన గణిత సార సంగ్రహం. ఇది మహావీరాచార్యుడు సంస్కృతంలో రాసిన సార సంగ్రహ గణితానికి అనువాదం. మల్లన గణితం పూర్తిగా పద్య కవిత్వం లేదా పద్య కావ్యం. ఈ ప్రకారం చూస్తే తెలుగులో గణిత వికాసం మొదటిగా కవిత్వ రూపంలోనే జరిగిందనేది సుస్పష్టం. ఇందులో వాదవివాదాలకు తావులేదు.

మల్లన గణితంలోని సీస సద్యం బాగా వ్యాప్తిలో ఉంది. **'ఖర్జూర ఫలములు గణకుండు కొని తెచ్చి సగపాలు మోహంపు సతికినిచ్చె...'** అంటూ ఆ పద్యం సాగుతుంది. చివరగా ఈ పద్యంలో పేర్కొన్న వ్యక్తి ఎన్ని ఖర్జూర ఫలాలు కొనుగోలు చేశాడు? ఎవరెవరికి ఎన్నెన్ని ఫలాలు ఇచ్చాడు? అని ప్రశ్న ఉంటుంది.

భాగాహారాలు, శాతాలకు సంబంధించిన ఈ ప్రశ్నను ఇలా పద్యరూపంలో అడగటం వల్ల ఏ మాత్రం కష్టంలేకుండానే సాధకుడు ఫలితాన్ని కనుగొనటం ప్రారంభిస్తాడు. తడకమళ్ళ వేంకట కృష్ణారావు రాసిన ఆంధ్ర లీలావతిలోని ఓ పద్యం ఇది.

సౌధతలమున విహరించె సప్తమాంశ
మష్టమూలంబు శయన గృహాంతరమున
జనగ యేబది యారుండె జాలకముల
గృహ కపోత గణమ్మెంత మహత కీర్తి!

ఈ పద్యం భావం ఏమిటంటే మొత్తం పావురాల్లో ఏడో వంతు మేడ మీద ఉన్నాయట. వాటిలో అష్టమూలం అంటే ఎయిత్‌రూట్ పడక గదిలో ఉన్నాయట. మిగిలిన 56 పావురాలు వలలో చిక్కుకున్నాయట. అయితే మొత్తం పావురాలు ఎన్ని అనేది సమస్య. దీన్ని గణితాత్మకంగా ఓ సమీకరణంగా రాయటం కన్నా ఓ ఇంట్లో పావురాలు ఉన్నాయి, వాటిలో కొన్ని పడకగదిలో ఉన్నాయంటూ చెప్పటం వల్ల విద్యార్థికి లెక్క చేయాలనే ఉత్సాహం కలుగుతుంది. పావురాలంటే పిల్లలకు ఆసక్తి. రోజువారీ మాట్లాడు కునే ఇల్లు, పడకగది, వల.. అన్నీ మన చుట్టూ ఉన్న విషయాలే కదా. ఇందులో కష్టం ఏముందనే భావం పిల్లాడికి కలుగుతుంది. తేలికగా లెక్క చేసేస్తారు. అంటే విద్యార్థికి గణితం అంటే ఏదో కష్టమైన విషయం అని భయం కలగకుండా మన చుట్టూ ఉన్నవే.. మనకు తెలిసినవే అనే భావం కలిగించి వారిని గణిత సమస్యల సాధన పట్ల ఉద్యుక్తులను చేయటంలో భాష ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. కవిత్వం చేదోడుగా ఉంటే కష్టమైన గణితాన్ని ఇష్టంగా మార్చువచ్చని తడకమళ్ళ వేంకట కృష్ణారావు నిరూపించారు. ఇక, ఆధునిక కవిత్వాన్ని పరిశీలన చేస్తే, ఆరుద్ర వంటి మహానుభావులు సైతం తమ కవిత్వంలో గణితాంశాల్ని వ్యక్తీకరించారు. మరికొందరు తాము చెప్పదలచుకున్న కవిత్వ భావాన్ని గణితం ఆధారంగా వివరించారు. ఆరుద్ర రాసిన త్వమేవాహంలో 'పెద్దముల్లు' అనే కవితలు తీసుకుంటే శ్రామిక వర్గపు శ్రమను పెట్టుబడి దారులు దోచుకుతింటున్నారనే భావం చెప్పటానికి ఆయన పైథాగరస్ సిద్ధాంత భావాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నారు.

కవితలో ఆసన్నభుజం, లంబం, చతురస్రం వంటి పదాలు ఉపయోగించారు.

ఆ కవిత ఇలా సాగుతుంది. దత్తాంశాలను పరిశీలించండి

చిన్న చిన్న చీమలు వగైరా – అడుగు భుజం
ఉత్పత్తి చేసే ఆహారం మీద ఆధారపడ్డ వారు – అడుగు బలం
ఈ భుజాల పరస్పర సంఘర్షణల ఫలితం
ఈ భుజాల కర్ణం మీది చతురస్రం
ఈ చతురస్రపు వైశాల్యం ఈజిక్వల్టు
రెండు విభిన్న భుజాలపై గల చతురస్రాల్లోని తమిస్రం

పూర్తిగా పైథాగరస్ సిద్ధాంతం ఇది. అంటే ఆధునిక కవులు సైతం గణిత భావాల్ని వ్యక్తీకరించటానికి కవిత్వాన్ని ఆసరాగా చేసుకున్నారని తెలుస్తోంది.

ఇంకా ఆధునిక కాలంలోకి వస్తే...

ప్రేమ + మనసు మనసు కలపాలి
ప్రేమ – ఈర్ష్యా ద్వేషాలు తీసేయాలి
ప్రేమ X అమ్మానాన్నలను గౌరవించాలి
ప్రేమ ÷ కష్టాలను భాగించాలి
ప్రేమ = ఇష్టాలను మిగుల్చుకోవాలి
ఇదే ప్రేమ గణితం.. ఇదే ప్రేమ జీవితం

ఓ అజ్ఞాత యువ కవి రాసిన కవిత్వం ఇది. ప్రియురాలికి తన ప్రేమను వ్యక్తీకరించటానికి కవిత రాసినా అందులోనూ గణితాన్ని పునాదిగా చేసుకున్నాడా కవి.

ఆధునిక కవిత్వంలోనూ గణితానికి ప్రముఖ స్థానమే ఉందనటానికి ఇదొక నిదర్శనం.

మరో పద్యం చూద్దాం

ఆరునొక్కట్ల నొడుపుగా నమరబెట్టి
యంత గుణకంబు చేతను నమర బెంచి
సొరిది వర్ణించి జనులకు జోద్యముగను
హిమకరోపమ లబ్ధంబు నెనయ వచ్చు

ఆరు ఒకట్లను అంటే ఆరు ఒకట్లు వరుసగా రాయగా వచ్చిన సంఖ్య.. 1, 11, 111.. ఒక లక్షా పదకొండు వేల నూట పదకొండును అదే సంఖ్య చేత గుణిస్తే లబ్ధం ఎంత వస్తుందనేది ఈ పద్యానికి భావం. ఇక, దీనికి సమాధానం చూద్దాం

ఒకపరి నెక్కు చంద్రునకు ఒండొక మారున తగ్గు తేజమున్
ప్రకటిత యాంధ్ర తేజచతురంబగు ప్రశ్నకు యత్తరంబిదే
ఒకపరి వ్రాయుమీ వరుస నొండొక మారున ముందు వెన్కలన్
ఒకటియు, రెండును, మూడులను ఒప్పుగ నాలుగు ఐదు యారులున్॥

ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, రాసి ఆ తర్వాత ఐదు నుంచి ఒక్కొక్కటి తగ్గిస్తూ ఒకటి వరకూ రాయాలనేది ఈ పద్యానికి భావం. అంటే లెక్కల్లో చెబితే దీని సమాధానం 12,34,56,54,321. చూడండి. ఎంత తేలికగా సమాధానం గుర్తుపెట్టుకోవచ్చు. ఈ సమాధానాన్ని పద్య రూపంలో కాకుండా గణితాత్మకంగా గుర్తు పెట్టుకోవాలంటే.. వందల కోట్ల స్థానాల నుంచి గుర్తు పెట్టుకోవాలి. ఆంగ్ల మాసంలో అయితే బిలియన్లు, ట్రిలియన్లు గుర్తుపెట్టుకోవాలి. అలా కాకుండా భాషను ఉపయోగించటం వల్ల ఎంత తేలికగా ఉందో మనం గమనించవచ్చు. పద్యంలోని చివరి పాదం చూడండి. ఒకటియు, రెండును, మూడులును ఒప్పుగ నాలుగు ఐదు యారులున్.. ఒకటి నుంచి ఆరు వరకు రాసి ఆ తర్వాత ముందు వెనుకలుగా రాయమని మూడో పాదంలో ఉంది. ఎంత తేలికగా సమాధానం వచ్చిందో గమనించండి.

తెలుగు సాహిత్యంలో జనసామాన్యానికి అతి చేరువైన సాహితీ ప్రక్రియ 'సామెతలు'. తన మొత్తం జీవితకాలంలో కనీసం ఒక్క సామెత కూడా ఉపయోగించకుండా ఉంటే మనిషి ఈ భూమ్మీద ఉండడనేది శాశ్వత సత్యం. కనీసం మాటల్లో అయినా అదేదో సామెత చెప్పినట్లు అంటారు. అంతగా మానవ జీవితంలో పెనవేసుకున్నాయి సామెతలు.

ఈ సామెతల్లో గణిత సంబంధమైనవి అనేకం ఉన్నాయి. ఆరు నూరైనా నేనాపని చేసి తీరతానంటాడు ఓ పెద్దమనిషి. అసలు ఆరు నూరు ఎందుకవుతుందనేది ఆయనకు అనవసరం. అలాగే, అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అని వాపోతాడు ఓ వ్యాపారి.

అమ్మటం, కొనటం.. అందులో ఉన్న లాభనష్టాలు ఆయనకే వదిలేద్దాం. పదహారణాల తెలుగింటి ఆడపిల్లలా ఉందంటారు బొంబాయి నుంచి వచ్చిన తెలుగు రాని కథానాయిక. రూపాయికే దిక్కులేని ఈ రోజుల్లో ఇంకా ఈ అణాలు... అందులోను ఏదో లెక్కపెట్టినట్లు ఈ పదహారు అణాలేమిటంటే.. పదహారు అణాలు సుమారుగా ఈ నాటి రూపాయి అంటే 100 పైసలుకు సమానం. అంటే నూరుశాతం తెలుగింటి ఆడపిల్లలా ఉందని ఆ సామెతకు అర్థం. దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా ఉంది నా పరిస్థితి అంటాడు ఒకాయన. క్షణం తీరిక లేదు దమ్మిడీ ఆదాయం లేదంటాడు మరొకాయన. ఇలా ఎవరెన్ని చెప్పినా వారందరి సాదకబాధకాలు వ్యక్తం చేస్తున్నది గణితాంశాల్లో అనేది సుస్పష్టం. అంటే అతి సామాన్యమానవుడు కపోల కల్పితంగా వచ్చే సామెతల్లో కూడా అనేక గణితాంశాలు ఉన్నాయనేది అత్యంత స్పష్టంగా ఋజువవుతోంది.

ఇక, గణిత బోధన విషయానికొద్దాం. సాధారణంగా గణితంలో భాషకు ప్రాధాన్యత ఉండదనే వాదన వినిపిస్తుంది. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు తరగతుల్లో ఎవరైన గణిత అధ్యాపకుడు భాష గురించి మాట్లాడినా, చేస్తున్న లెక్కల్లో భాషాదోషాలు పట్టుకున్నా విద్యార్థులే మ్యాథ్స్‌లో లాంగ్వేజ్ ఏంటి సార్? అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతారు. ఇది విషయ పరిజ్ఞానం లేని వారు మాట్లాడే మాట. ఎందుకంటే... గణితానికి భాష అవసరం లేదు అనుకునేటట్లయితే మన లెక్కల పుస్తకాల్లో ఉన్న సమస్యలన్నీ అర్థం లేనివి అవుతాయి. ఆధునిక విద్యా విధానం విద్యార్థుల స్థాయికి అనుగుణమైన భాష వాడాలని చెబుతోంది. ఈ ప్రకారం చూస్తే సర్వసాధారణంగా అందరూ కష్టంగా భావించే గణితాన్ని అతి తేలికైన భాషలో విద్యార్థికి అర్థమయ్యే భాష ఉపయోగించి బోధన చేయాలి. కాబట్టి, గణితాన్ని అతి తేలికైన భాషలో విద్యార్థికి అర్థమయ్యే భాష ఉపయోగించి బోధన చేయాలి. కాబట్టి, గణితానికి భాష అవసరం తప్పని సరి అని బోధపడుతోంది.

రెండో అంశంగా గణితంలో వచ్చే సాంకేతిక పదాలు కొన్ని తీసుకుందాం. ఆవర్తనము, పరావర్తనము, లంబ కోణము, త్రిభుజము, పరిధి, వైశాల్యము.. ఇలా ఏ సాంకేతిక

పదాన్ని తీసుకున్నా అందులో గణితాంశం కన్నా భాషాంశం యొక్క ప్రాధాన్యత ఎక్కువగా కనిపిస్తుంది. లంబకోణము అన్న చోట లంబము, కోణము అనే పదాలు కాకుండా వేరే పదాలు వాడితే అర్థలోపం వస్తుంది. 90 డిగ్రీలు అనే అర్థం రావాలంటే లంబ అనే పదం వాడక తప్పదు. మూడు భుజాలు ఉన్నాయి కాబట్టి త్రిభుజము అన్నారు. ఇక్కడ త్రిభుజము అనే పదం కాకుండా మరొకటి ఊహించగలమా? అసాధ్యం.. అర్థం లేని విషయం అవుతోంది. కాబట్టి, సాంకేతిక పదాల విషయంలో అది గణితమైనా భాష ఆధారంగా లేకపోతే అభివృద్ధి సాధించలేదనేది సుస్పష్టం.

ప్రాచీన గణిత శాస్త్రవేతల రచనలు చూడండి. భాస్కరాచార్యుడు, ఆర్యభట్ట మరెవరైనా తమ గణిత శాస్త్ర పరిశోధనల్ని సంస్కృత భాష ఉపయోగించి, గ్రంథస్తం చేశారు. భాష లేకుండా పూర్తిగా గణితాత్మకంగా వారు విషయాన్ని చెప్పి ఉంటే ఈ క్షణానికీ అవి పిచ్చిరాతలుగానే మిగిలిపోయేవి. కేవలం సంస్కృతమే కాదు. ఏ భాష అయినా సరే, ఆ భాషలో వచ్చిన గణిత విజ్ఞాన వ్యాప్తికి ఆధారంగా నిలుస్తుంది. ఆర్కెమిడీస్ కూడా తాను చేసిన ఓ గణిత సాధనకు కవిత రూపంలో చెప్పినట్లు ఆయన జీవిత చరిత్రలో ఉంది.

మొత్తంగా ఈ చర్చవల్ల తేలిందేమింటంటే.. గణితానికి భాష పునాది. ఇందులో ఏ సందేహానికీ తావులేదు. భాష తోడు లేనిదే గణిత శాస్త్ర అభివృద్ధి జరగదు. కేవలం గణితమనే కాదు.. ఏ శాస్త్రమైనా, విజ్ఞానమైనా ఆయా శాస్త్రాల అభివృద్ధికి భాష చేదోడు ఎంతో అవసరం. ఎంతటి గొప్ప శాస్త్రవేత్త అయినా తాను కనుగొన్న సిద్ధాంతాలను, ఆవిష్కరణలను సమాజానికి అందించాలంటే అతనికి తప్పనిసరిగా భాషా సామర్థ్యం ఉండి తీరాలి. లేదంటే తాను కనుగొన్న విషయాలను తన మనసులోనే సమాధి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎంచుకున్న భాషలోనే తన భావాన్ని ఆ శాస్త్రవేత్త కొంత కవితాత్మకంగా చెబితే, అది మరింత రాణింపునకు వచ్చి, పాఠకుల ఆదరణ పొందుతుంది. కాబట్టి, కవిత్వమొక తీరని దాహం. గణితం ఒక అంతులేని విజ్ఞానం.

ఒక వ్యక్తి జననం, మరణం ఆ వ్యక్తికి సంబంధం లేకుండానే జరుగుతాయి. జన్మించిన నాటి నుండి మరణించే వరకు మనిషి సుఖంగా జీవించడానికి విజ్ఞాన శాస్త్రం దోహద పడుతుంది. ప్రపంచంలో వివిధ జాతులు ఉన్నాయి. ప్రతి జాతికి దానిదైన ఒక తత్వం ఉంటుంది. భారతజాతికీ ఉంది. భారతీయ తాత్విక భూమికను అర్థం చేసుకోవాలనుకున్న వారెవరైనా వేదాలను చదివి అర్థం చేసుకున్నప్పుడే అది సాధ్యం అవుతుంది. భారతీయ వైజ్ఞానిక శాస్త్ర మూలాలు వేదంతో ముడిపడి ఉన్నాయనేది నిర్వివాదాశం. ఈ నేపథ్యంలో దేశ విదేశీ ప్రముఖుల, వైజ్ఞానికుల ఆలోచనలను పరిశీలిద్దాం.

A study of the hymns of the **Rg-veda** is indispensable for any adequate account of indian thought whatever we may think them, half formed myths or crude allegories obscure groupings or immature composition. Still they are the source of the later practices and a study of them is necessary for a proper understanding of subsequent thought. అంటారు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ తన ఇండియన్ ఫిలాసఫీ అనే గ్రంథంలో.

అథర్వవేదంలో వివరించిన శాస్త్రాలు మచ్చుకు కొన్నింటిని పరిశీలిద్దాం.

అథర్వవేదస్యార్థశాస్త్రం నీతి శాస్త్రం శస్త్రశాస్త్రం
విశ్వకర్మాదిప్రణీత శిల్ప శాస్త్రమ్॥

(చరణవ్యూహ – చతుర్థఖండ పు. 48)

అథర్వవేద ఉపవేద మయిన అర్థవేదానికి 'శిల్పశాస్త్ర' మనికూడా పేరు. విశ్వకర్మ, త్వష్ట, మయుడు, దైవజ్ఞుడు మొదలగు శిల్పాచార్యులు రచించిన సంహితలు ఉన్నాయి. వీనియందు విమాన తారా భూగర్భాది విద్యలను అభ్యసించుటకు ఆరు ఏడు సంవత్సరాలు పడతాయని దయానంద సరస్వతి **సంస్కారవిధి** అనే గ్రంథంలో తెలిపాడు.

విశ్వకర్మ చేత రచింపబడిన అర్థవేదంలోని దశవిధ శిల్పవిద్యలు ఇవి 1) కృషిశాస్త్రం (Agricultural Engineering) 2) జలశాస్త్రం (Water Management) 3) ఖనిజశాస్త్రం (Mining and Metallurgy) 4) నౌకాశాస్త్రం (Ship Building) 5) రథశాస్త్రం (Science of Chariots or Automobile Engg.) 6) విమానశాస్త్రం (Aeronautics) 7) వాస్తుశాస్త్రం (Architecture) 8) ప్రాకార శాస్త్రం (నగర సంరక్షణార్థం దుర్గప్రాకార నిర్మాణ శాస్త్రం - (Construction of Forts and Compounds) 9) నగర రచనా శాస్త్రం (Town Planning) 10) యంత్ర శాస్త్రం (Machanics-Science of Machinary)

The modern Science has started from the eighteenth century. In reference to ancient India, Hindus were using proper units to m**easure the fundamental Physical quantities which must have been used to unfold mystery of nature. It will be interesting to note that the laws of mechanics and gravitational, electrical charges were well known to them. Instead of inventing parallels, the proper study of ancient literature should be made so that we may meet challenges of the new millinium.**

Measurements

ఋగ్వేదం (చరిత్ర ప్రకారం క్రీ.పూ. 4500 - 2500 వరకు), సూర్య సిద్ధాంతం, మయమతం మొదలగు శిల్ప శాస్త్రగ్రంథాలు అనుసరించిన కొలతలను పరిశీలించండి.

మయమతంలోని మానోపకరణం.

8 పరమాణువులు	=	1 రథరేణువు
8 రథరేణువులు	=	1 వాలాగ్రం
8 వాలాగ్రాలు	=	1 లీక్ష
8 లీక్షలు	=	1 యూక
8 యూకలు	=	1యవ
8 యవలు	=	1 అంగుళం
12 అంగుళాలు	=	1 వితస్తి
2 వితస్తులు	=	1 హస్తము
4 హస్తాలు	=	1 దండము
8000 దండాలు	=	1 యోజన

పురుష సూక్తంలోని విరాట్ పురుషుని వర్ణన పరిశీలిస్తే దానిలో భూమి గోళాకారంగా ఉందని తెలియజేయడమే కాకుండా భూమి చుట్టుకొలత గణన చేసే విధం కూడా వివరించింది.

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష స్సహస్రపాత్।

స భూమి విశ్వతో వృత్వా అత్యతిష్ఠ ద్దశాంగుళమ్॥ - పురుషసూక్తం

ఈ మంత్రం అర్థం ఇది. సహస్రశీర్షా 1000 సహస్రాక్షః (2000) సహస్రపాత్ (2000) పరిమాణవాను పురుషః (గోళం) సఃదశ - అంగుళం (హస్తమానానికి ఒక అంగుళం) పరితః బహిర్బాహిః భూమి (The Earth) అవతిష్ఠతి

భూమి చుట్టుకొలత = 1000 X 2000 X 2000 X 24/25 అంగుళాలు = $4X10^9$ X24/25 X 1/96 దండాలు = 4 X 10^7 దండాలు.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం భూమి చుట్టు కొలత $4X10^7$ మీటర్లు. అతిపురాతన భారతీయ విజ్ఞానం ఆధునిక విజ్ఞానం దాదాపుగా ఒకే విలువను సాధించడం - ఆశ్చర్యమే - అయినా యథార్థమే.

కొందరు అంతగొప్ప ఇంజనీరింగ్ సమాజానికి సామాన్యునికి ఉపయోగ పడిందా? అని ప్రశ్నిస్తుంటారు. నిజవేమరి సర్వశాస్త్రాలు చివరిగా సామాన్యునికి ఉపయోగపడినప్పుడే కదా! సార్ధకత. క్రింది చారిత్రిక సంఘటన ఒక నాటి యదార్థాన్ని కళ్ళముందు ఉంచుతుంది చూడండి.

మలబారు, బెంగాలు ప్రాంతాలలో తూర్పుఇండియా వర్తక సంఘం ప్రతినిధి వారి నాగలి (Coult) ప్రవేశపెట్టటానికి చేసిన ప్రయత్నంవలన రైతులలో వ్యతిరేకత మొదలయింది. నిజానికి ఇనుపకర్రు కల్గిన (కోజి) నాగలిని పూర్వకాలం నుండి భారతీయులు ఉపయోగిస్తున్నారు. దీని ప్రస్తావన 'పెరుమ్ పనట్రుప్పాడై' అనుగ్రంథంలో ఉంది. దానిని భారతీయ రైతులు వివేకంతో నేల స్వభావాన్ననుసరించి ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు సారవంతమైన కావేరి తీరప్రాంతంలో తేలికపాటి నాగళ్లను తొండమండలంలేదా కొంగుమండలం లోని మెట్టప్రాంతాలలో 4 ఎద్దులతో లాగే బరువైన నాగళ్లను ఉపయోగిస్తున్నారు. ఇంకను శ్రీ కృష్ణదేవరాయల మంత్రి మాధవ విరచిత పరాశర మాధవీయంలో ఆరులేక ఎనిమిది ఎడ్లతో లాగే నాగళ్ళు ఉపయోగించే వారని వాటి వలన దిగుబడి తగ్గిందని గుర్తించారు. డెల్టా ప్రాంతంలో ధాన్యం దిగుబడి 1:12 లేదా 1:20గా ఉంది. హామిల్టన్ బుచ్చన్ రాతలవలన శ్రీరంగపట్నం ప్రాంతంలో రాగుల దిగుబడి 18వ శతాబ్దంలో 1:40గా ఉంది.

